నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, మంగళవారం 26 డిసెంబర్ 2023 | NIZAMABAD


## పలు రైళ్లు రద్దు..



రైల్వే నిర్వహణ పనుల నేపథ్యంలో ఎస్సీఆర్ నిర్ణయం

సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైల్వే నిర్వహణ పనులతో పలు రైలు మార్గాల్లో ఆరు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సోమవారం రైల్వే అధికారులు తెలిపారు. మిరాజ్–పార్లీ, కల్హాపూర్–నాగ్‌పూర్, కొల్హాపూర్–ధనబాద్ వంటి రైల్వేస్టేషన్ల మధ్యలో ఆరు రైళ్లను రద్దు చేశామన్నారు. ఈ నెల 26 నుంచి జనవరి 5 వరకు టైమ్‌టేబుల్ వారీగా రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే మరో నాలుగు రైళ్లను పాక్షికంగా రద్దు చేశామని తెలిపారు.



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం

## దైవనామ స్మరణతోనే ప్రశాంతమైన జీవనం

### ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 25 : మానవ జీవితంలో దైవ చింతనకు ప్రత్యేక స్థానం ఉంటుందని, దైవన్నామస్మరణతో ప్రశాంతమైన జీవనం లభిస్తుందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడలోని గాయత్రి ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఆలయాలు, ప్రార్థనా మందిరాలు నిర్మించడానికి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేశామని తెలిపారు. కొన్ని ఏండ్ల క్రితం గాయత్రి ఆశ్రమ పీఠాధిపతి సుదర్శన దండి స్వామీజీ.. ఆశ్రమం గురించి తనను కలిసినట్లు చెప్పారు. ఇందుకుగాను గాయత్రి ఆశ్రమం నిర్మాణం కోసం స్థలం కేటాయించడంతోపాటు అందులో ఆలయాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి సొంత డబ్బులను విరాళంగా ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ భూషణ్ రెడ్డి, బాన్సువాడ, బుడ్మి సొసైటీ చైర్మన్లు కృష్ణారెడ్డి, గంగా రాం, సీనియర్ నాయకులు ఎజాస్, కౌన్సిలర్ లింగమేశ్వర్, తాడ్కోల్ సర్పంచ్ రాజు, బాన్సువాడ పట్టణ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు అనిత, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నిజామాబాద్ సీఎస్ఐ చర్చిలో సందేశాన్ని వినిపిస్తున్న ఫాదర్, హాజరైన క్రైస్తవులు

- కిటకిటలాడిన చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు
- క్రీస్తు సందేశాలను వివరించిన పాస్టర్లు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు



వర్ని చర్చిలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోచారం

## ఘనంగా క్రిస్మస్





**ఉమ్మడి** నిజామాబాద్ జిల్లాలో క్రిస్మస్ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులతో చర్చిలన్నీ కిటకిటలాడాయి. క్రిస్మస్ సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన చేశారు. ఆయా చర్చిల్లో ఫాదర్లు, పాస్టర్లు ఏసు సందేశాలను చదివి వినిపించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని పలువురు ఎమ్మెల్యేలు చర్చిలను సందర్శించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రీస్తు బోధనలపై ప్రసంగించారు. కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.




నవీపేటలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

## ప్రజాపాలనపై నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమీక్ష

నిజామాబాద్ స్పోర్ట్స్/కామారెడ్డి, డిసెంబర్ 25 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ప్రజాపాలన కార్యక్రమంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం సమీక్ష నిర్వహించనున్నారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమీక్ష ఉంటుందని నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, జితేశ్ వీ పాటిల్ తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమీక్షా సమావేశంలో నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొంటారన్నారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులలో నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమం అమలు తీరుపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉమ్మడి జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేస్తారని కలెక్టర్లు వివరించారు. సంబంధిత అధికారులందరూ సమగ్ర వివరాలతో సకాలంలో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

## త్వరలోనే మిగతా పథకాల అమలు

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్..
### ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 25 : ఆర్మూర్ కొత్త బస్టాండ్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పరిశీలించారు. బస్టాండ్‌లో ఉన్న మహిళలను ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే రెండు పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేసిందన్నారు. మిగతా పథకాలను త్వరలోనే అమలు చేస్తామని అన్నారు. ప్రయాణికుల ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని అవసరమైతే మరో రెండువేల కొత్త బస్సులను కొనుగోలు చేస్తామని తెలిపారు. అవసరమైన రూట్లలో కొత్త బస్సు సర్వీసులను ప్రారంభిస్తామన్నారు.

ఆర్టీసీ ఆస్తులను కబ్జా చేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గతంలో లీజుకు ఇచ్చిన స్థలాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. అక్రమాలు జరిగినట్లు తేలితే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## రేపు ఆటో యూనియన్ జిల్లా సమావేశం

మాచారెడ్డి, డిసెంబర్ 25 : జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ఆటో యూనియన్లతో బుధవారం సమావేశం నిర్వహించి జేఏసీ ఏర్పాటు చేయనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం మాట్లాడారు. కామారెడ్డిలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఇన్‌చార్జిని నియమించనున్నట్లు తెలిపారు. ఆటో కార్మికుల హక్కుల కోసం జేఏసీ ముందుండి పోరాడుతుందని అన్నారు. అన్ని మండలాల నుంచి యూనియన్ సభ్యులు పాల్గొని జేఏసీ ఎన్నికను విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు రాజిరెడ్డి, కృష్ణ, కృష్ణంరాజు, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బేస్‌బాల్ చాంపియన్‌గా నిజామాబాద్ జిల్లా జట్టు

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 25 : మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన 67వ రాష్ట్ర బేస్‌బాల్ అండర్–14 రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో జిల్లా బాలికల జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఆదిలాబాద్ జట్టుపై 08–02 తేడాతో గెలుపొంది టోర్నమెంట్ చాంపియన్‌గా నిలిచినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జట్టుకు కోచ్‌గా మార్కంటి గంగామోహన్, మేనేజర్లుగా నవీన్, రాజేందర్, సంతోష వ్యవహరించినట్లు తెలిపారు.



ఎంపికైన క్రీడాకారులు

## బాలికా కమిటీ.. సంరక్షణ దివిటి

- నిజామాబాద్ జిల్లాలోని 353 పాఠశాలల్లో బాలికా సాధికారత కమిటీలు
- రోజుకు రెండు మూడు చోట్ల అవగాహన సదస్సులు
- విద్యార్థినుల్లో చైతన్యం, ఆత్మస్థైర్యం నింపేలా కార్యక్రమాలు



కోటగిరి హైస్కూల్‌లో బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)



కోటగిరి, డిసెంబర్ 25: బాలికలకు స్వేచ్ఛ, సమానత్వం, హక్కుల గురించి తెలియడమే కాకుండా సమాజంలో వారికి ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా చేపడుతున్న బాలికా సాధికారత కార్యక్రమాలు ఎంతో దోహదపడుతున్నాయి. బాలికల్లో చైతన్యం, ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నాయి. ప్రాథమికోన్నత స్థాయి నుంచే ఆడపిల్లలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది తిరిగి కమిటీలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. లింగ వివక్ష, హింస, వేధింపులు తదితర అంశాలపై బాలికలను అప్రమత్తం చేసేలా కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి జిల్లాకు వందకు పైగా పాఠశాలల్లో బాలికలతో కమిటీలను రూపొందిస్తున్నారు.

**పాఠశాలలోనే కమిటీల ఏర్పాటు..**

విద్యార్థులతోనే బాలల కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ప్రతి తరగతి నుంచి ఇద్దరు విద్యార్థినులతోపాటు ఒక ఉపాధ్యాయిని, షీ టీం సిబ్బంది సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీకి ప్రధానోపాధ్యాయుడు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. క్లిష్ట పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవడం, ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగడంతోపాటు బాలికలను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కమిటీలు పని చేస్తాయి. విద్యాశాఖ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లాలోని 353 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అధికారులు.. కమిటీలను నియమిస్తున్నారు. ఇప్పటికే చాలావరకు కమిటీల నియామకం పూర్తికాగా, అవగాహన కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి. మిగితా విద్యాలయాల్లో సాధికారత కమిటీల ఏర్పాటు కొనసాగుతున్నది.

**ఆత్మరక్షణపై శిక్షణ..**

పాఠశాలల్లో డయల్ 100, 1098, 181 వంటి హెల్ప్‌లైన్ నంబర్లను నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేశారు. బాల్య వివాహాలు, హింస, వేధింపులు వంటి అంశాలపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. బాలికల ఎదుగుదలతోపాటు శారీరక మార్పులు, ఆరోగ్య సమస్యలు, శుభ్రతపై నిపుణులతో అవగాహన కల్పిస్తారు. దాడులను ఎలా ప్రతిఘటించాలో నేర్పుతారు. ఇప్పటికే ఎంపికచేసిన పాఠశాలల్లో ఆత్మరక్షణ కోసం శిక్షణ ఇస్తున్నారు.

**ఆత్మస్థైర్యం నింపేందుకు చర్యలు..**

జిల్లాలో ఎంపిక చేసిన 353 పాఠశాలల్లో బాలికా సాధికారత కమిటీలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ సూచించింది. వీటి ద్వారా బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు అవకాశం ఏర్పడతుంది. సమాజంలో బాలికలపై జరుగుతున్న దాడులను ఎలా ఎదుర్కోవాలో చైతన్య కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఈ కమిటీ ద్వారా నిర్వహించే కార్యక్రమాలు బాలికలకు ఎంతో ఉపకరిస్తాయి.

**- చైతన్యకుమార్, బాలికల సంరక్షణ అధికారి, నిజామాబాద్**

## ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 25 : ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సోమవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏమైనా సమస్యలుంటే క్యాంపు కార్యాలయానికి రావాలని.. పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. అనంతరం దేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

### ఉచిత పేరిణి నాట్య శిక్షణ శిబిరం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 25 : భాషా సాంస్కృతిక శాఖ , భీమన్ నృత్య నికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి 6 నెలల పాటు ఉచిత పేరిణి నాట్య శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేరిణి అన్నెలదేవి రాజేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 9393994141 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జూన్ 2024లో వెయ్యి మంది పేరిణి నృత్య కళాకారులతో మహా నృత్య ప్రదర్శన హైదరాబాద్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



మాక్లూర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

## మాక్లూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

మాక్లూర్, డిసెంబర్ 25 : మండల కేంద్రానికి చెందిన కూన ప్రసాద్ కుటుంబ సభ్యులు ఇటీవల దారుణ హత్యకు గురవగా.. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ గ్రామస్తులు, యువకులు సోమవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ప్రసాద్ ఇంటి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఒకే కుటుంబంలో ఆరుగురిని అతి కిరాతకంగా చంపిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు

అయోధ్య శ్రీరాముడి పూజిత అక్షింతలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చేరుకున్నాయి. వివిధ ప్రాంతాల్లో అక్షింతలతో శోభాయాత్రలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, భాజాభజంత్రీలు, మంగళహారతులతో రామయ్య అక్షింతలకు భక్తులు స్వాగతం పలికారు.

